శ్రీ యస్.కె.నరసింహారావు, ఐ.ఏ.ఎస్.
రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్
జిల్లా ప్రాథమిక విద్యా పథకం

## ఓ మాట...

నేర్చుకోవడం జీవితం నుంచి వేరైన నాటి నుంచి 'చదువు' మొదలయ్యింది. ఈ చదువు ఉన్న వారికీ, లేనివారికీ మధ్య వివక్షత చూపుతూ ఉన్న వారిని అందలం ఎక్కిస్తూనే, ఇంకోవైపు చింతబెత్తం, బట్టీ పట్టడం, మూసపోత మూక ఆలోచన విధానాన్ని ప్రోత్సహిస్తూ వస్తోంది. చదువును ఆసక్తికరంగా, సృజనాత్మకంగా, ఆనంద దాయకంగా, జీవితంతో సంబంధం గలదిగా మలచటానికి సమాంతరంగా అనేక ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ విషయంలో మన దేశంలో ఠాగూర్, గాంధీ, గిజుభాయి ఆలోచనలు ఎందరికో ప్రేరణగా నిలిచాయి. ఇటువంటి తత్వవేత్తలు, విద్యావేత్తల గురించి, చదువులలో ప్రయోగాల గురించి ఆరు పుస్తకాలను కూర్చి 'చదువులు - కొత్తదారులు' పేరుతో జనవిజ్ఞాన వేదిక, మంచి పుస్తకం కలిసి ప్రచురించటం సంతోషం. అన్ని వేళలా, అన్ని సందర్భాలలో పిల్లల పక్షాన ఉండటమే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చేయవలసిన పని అని ఈ పుస్తకాలు చెబుతాయి. ఇంకెందరో విద్యావేత్తలూ, వారి ప్రయోగాలూ ఇందులో చోటు చేసుకోకపోయినప్పటికీ ఈ ప్రయత్నం చదువుతో ముడిపడిన వారందరికీ - విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పిల్లల బాగుకోరే వారందరికీ ఉపయోగకరంగా ఉంటుందనీ, ఆలోచనలకు ఊతమవుతుందనీ ఆశిస్తూ...

హైదరాబాదు
సెప్టెంబరు, 2002

(యస్.కె.నరసింహారావు)



# సరదా చదువు

**అరవిందగుప్తా**

అనువాదం: కె.మాధవి, యం.శ్రీనివాస్

జన విజ్ఞాన వేదిక
మంచి పుస్తకం



చదువులు - కొత్తదారులు-4
సరదా చదువు: అరవింద్ గుప్తా (సంపాదకత్వం)
హిందీమూలం: ఖుషియో కా స్కూల్ (ఫుల్ ఝుడీ నుండి)
అనువాదం: కె.మాధవి, యం.శ్రీనివాస్
బొమ్మలు: అవినాష్ దేశ్‌పాండే
తెలుగులో ఈ పుస్తకమాల సంపాదకులు: కె.సురేష్
© కృతజ్ఞతలతో: ఫుల్‌ఝుడీ

కంపోజింగ్: ఆర్.జె. గ్రాఫిక్స్
చిక్కడపల్లి, హైదరాబాద్-500 020.
ఫోన్: 661 0373

ముద్రణ: చరిత గ్రాఫిక్స్
చిక్కడపల్లి, హైదరాబాద్-020.
ఫోన్: 760 7361

వెల: రూ. 7.00
ప్రచురణ కాలం: సెప్టెంబరు, 2002

ప్రచురణ, ప్రతులకు:
జన విజ్ఞాన వేదిక
జి.మల్యాద్రి, కన్వీనర్ ప్రచురణల విభాగం
162, విజయలక్ష్మినగర్
కొత్తూరు పోస్ట్, నెల్లూరు - 524 004.
ఫోన్: 0861-305303

మంచి పుస్తకం
'వాసన్', 12-13-452, వీధి నెం.1
తార్నాక, సికింద్రాబాద్ - 500 017.

జాతీయ సాక్షరతా మిషన్ సహాయంతో భారత జ్ఞానవిజ్ఞాన సమితి, న్యూఢిల్లీ ప్రజల చదువుల ఉద్యమం (జనవాచన్ ఆందోళన్) పేరుతో బాలల పుస్తకమాలగా దాదాపు 60 పుస్తకాలు ప్రచురించింది. గ్రామీణ ప్రజలు, పిల్లల్లో చదవటంపట్ల ఆసక్తి కలిగించటం ఈ పుస్తకాల ఉద్దేశం. వాటిల్లోనుంచి చదువులు, విద్యావేత్తలు, కొన్ని ప్రయోగాత్మక బడుల గురించిన ఆరు పుస్తకాలను ఎంపికచేసి 'చదువులు - కొత్తదారులు' పేరుతో ప్రచురిస్తున్నాం. ఈ ఆరు పుస్తకాలు ప్రత్యేకించి 'చదువు'కి సంబంధించి ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, తత్వవేత్తలు, కార్యకర్తలు, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రచురిస్తున్నాం.

# సరదా చదువు



## డా॥ అరవింద్ గుప్తా

# ఇంటినుండి పత్రిక

లెనిన్ పేరు మీలో చాలా మంది వినే ఉంటారు. ఆయన ప్రపంచంలో పేరొందిన నాయకుల్లో ఒకరు. 1917లో రష్యాలో జరిగిన విప్లవానికి ఆయన నాయకత్వం వహించారు. ఈ విప్లవం వల్ల ప్రపంచంలోని ఎన్నో కోట్ల మంది ప్రజలు బానిస సంకెళ్ళను తెంచుకున్నారు. లెనిన్ సంపన్నుల ఇంట్లో జన్మించారు. అయినా కూడా ఆయన బీద రైతులకి, కార్మికులకి నాయకత్వం వహించారు. ఆయన చిన్నతనంలో వారి ఇంట్లో చక్కటి వాతావరణం నెలకొని ఉండేది. వాళ్ళ నాన్న విద్యావిభాగంలో ఉన్నత పదవిలో ఉండేవారు. లెనిన్ అన్న అలెగ్జాండర్ ఫిజిక్స్ విద్యార్థి. ఆయన చెల్లెలు బడికి వెళ్ళేది. వాళ్ళ అమ్మగారు ఇంటి పని చూసుకునేవారు.

లెనిన్ వాళ్ళ ఇంట్లో ప్రతివారం ఒక పత్రిక రాసేవారు. ఆ పత్రిక కోసం ఇంట్లో ప్రతి ఒక్కరు ఏదో ఒక విషయం మీద వ్యాసం రాసేవారు. పాఠశాలలకి సంబంధించిన ఏదైనా ఆసక్తికరమైన విషయం మీద వాళ్ళ నాన్న రాసేవారు. వాళ్ళ అమ్మ ఏదైనా కవిత గానీ, వంటింటి విషయం గానీ రాసేవారు. లెనిన్ అన్న సైన్సు విద్యార్థి కావడం వల్ల కొత్త వైజ్ఞానిక విషయం మీద రాసేవారు. లెనిన్ తన బడి విషయం ఏదైనా అందులో కూర్చేవారు. వాళ్ళ చెల్లెలు ఆ పత్రిక కోసం మంచి బొమ్మలు గీసేది.

ఈ నాలుగు కాగితాల పత్రిక చేత్తో రాసేవారు. ఆదివారంనాడు





పొద్దున ఫలహారం చేసేముందు ఆ పత్రికని పూర్తిగా చదివేవారు. ఆ పత్రిక చదివిన తరువాతే ఫలహారం చేసేవారు. చిన్నప్పటి ఈ అనుభవం లెనిన్ జీవితంలో చాలా బలంగా నాటుకుంది. చాలా సంవత్సరాలు విదేశాలలో ఉండి రష్యా వచ్చీ రాగానే ఆయన మొదట ఒక పత్రిక మొదలు పెట్టారు. ఆ పత్రిక పేరు "ఇస్కార్", అంటే దీపం అని అర్థం. ఈ పత్రిక రష్యాలోని వివిధ వర్గాల ప్రజలను ఒక త్రాటి కిందకు తీసుకుని వచ్చింది. ఈ విధంగా రష్యాలో జరిగిన విప్లవంలో ఒక విలువైన పాత్రని పోషించింది.

చిన్నప్పుడు నేర్చుకున్న మంచి విలువలే మనిషిలోని మానవత్వానికి పునాదిరాళ్ళు. చిన్నపిల్లలకి ఇంట్లో మంచి ఆరోగ్యవంతమైన, ప్రశాంతమైన వాతావరణం లభిస్తే పెద్ద వాళ్ళయినాక వాళ్ళు తప్పక మంచి ప్రతిభాశాలులు అవుతారు. ఎంతో పేరు సంపాదించుకుంటారు. ✪

# ప్రెస్టోలీ పాఠశాల

టెడ్డీ ఓనీల్ 26 సంవత్సరాల యువకుడు. ఆయన ఉత్సాహం, పట్టుదల కలిగిన ఒక మంచి టీచరు. పిల్లలకి మంచి విద్య నందించాలని కలలు గనేవాడు. 1930 సంవత్సరంలో ఆయనని ఇంగ్లాండులో "ప్రెస్టోలీ" అనే కార్మికవాడలో బడి టీచరుగా నియమించారు. ఆ బడిలో పరిస్థితి చాలా దయనీయంగా ఉండేది. అక్కడ ఎలాంటి పరికరాలు, పుస్తకాలు ఉండేవి కావు. పిల్లలకి కూర్చోవడానికి బల్లలు, కుర్చీలు కూడా ఉండేవి కావు. ఈ స్థితిలో పిల్లల్లో ఏదైనా నేర్చుకోవాలనే ఆసక్తి మచ్చుక్కైనా కనిపించేది కాదు. మొత్తం మీద అదొక పనికిరాని బడి. టెడ్డీకి వడ్రంగి పని అంటే చాలా ఇష్టం. అక్కడికి వెళ్ళిన మర్నాడే తన పనిముట్లని బయటకి తీసి ఒక పుస్తకాల బీరువా తయారుచేయడం మొదలెట్టాడు. అక్కడ ఒక గదిలో విరిగిన చెక్క సామాను పడేసి ఉండేది. ఆయన వాటికే మరమ్మతులు చేసి పిల్లలకి కుర్చీలు, బల్లలు తయారుచేశాడు. టెడ్డీ ఇలా పని చేయడం చూసిన పిల్లలు ఆయనతోపాటుగా రకరకాల వస్తువులు తయారుచేశారు. ఒకరు బొమ్మరిల్లు చేస్తే, ఇంకొకరు పంజరం, మరొకరు కుందేలుకి ఇల్లు తయారు చేశారు. పాఠాలు లేకుండా చాలా రోజులపాటు ఈ వడ్రంగి పనే నడిచింది. పుస్తకాల బీరువా తయారయిన వెంటనే అందులో పుస్తకాలుండాలనే కోరిక కూడా పిల్లలకి కలిగింది. కొంతమంది పిల్లలు నిజంగానే కుందేలుని పెంచడం మొదలెట్టారు. దాని ఆహారం, ఇతర అలవాట్ల





గురించి తెలుసుకోవాలనే ఉత్సాహం వారిలో పెరిగింది. పంజరంలో పక్షులని పెంచే పిల్లలు వాటి గురించి తెలుసుకోవడానికి ఆసక్తి కనబరిచారు. ఈ విషయాలన్ని పుస్తకాలలో ఉంటాయి కాబట్టి, వాటిని చదవడం కూడ పిల్లలు మొదలెట్టారు. ఇలా చదువుతూ మెల్లమెల్లగా పుస్తకాలని చదవడం ఇష్టపడ్డారు.

టెడ్డీకి బట్టీ పట్టే చదువు అన్నా, అలాంటి బడులన్నా పరమ చిరాకు. ఆయన ఒక గొప్ప విద్యావేత్త. ఆయన ముప్పై సంవత్సరాల పాటు 'ప్రెస్టోలీ బడి'లో పాఠాలు చెప్పారు. ప్రపంచం నలుమూలల నుండి ఎంతోమంది ఈ బడిని చూడడానికి వచ్చేవారు. ఆయన తన పనిద్వారా చేతిపనుల మీద ఆధారపడిన విద్యావిధానాన్ని బలపరిచారు. తన అనుభవాలన్నిటిని ఒక ఆసక్తికరమైన పుస్తకంగా రాశారు. దానిపేరు "ఇడియట్ టీచర్". ✪

# ఆనందానికి నిలయం - ఆ బడి

సోవియట్ రష్యాలోని ప్రముఖ విద్యావేత్తలలో వసీలీ సుఖోమ్లీన్స్కీ ఒకరు. రెండవ ప్రపంచ యుద్ధం సమయానికి 23 ఏళ్ళ వసీలీ, ఒక ప్రాథమిక పాఠశాలలో టీచరుగా ఉండేవారు. అవసరాన్ని బట్టి ఆయన పోరాడడానికి యుద్ధ రంగానికి వెళ్ళిపోయారు. ఆయన భార్య వేరా ఉన్న ప్రాంతాన్ని శత్రువులు ఆక్రమించుకున్నారు. శత్రువుల మీద దాడి చేసేవారికి ఆమె సహాయపడేది. ఒక రోజున "ఫాసిస్టు దుర్మార్గులు" ఆమెను పట్టుకుని ఖైదు చేశారు. అక్కడే ఆమెకి ఒక కొడుకు పుట్టాడు. తమపై దాడులు జరుపుతున్న వారి పేర్లు చెప్పమని శత్రువులు ఆమెని చిత్రహింసలు పెట్టారు. కానీ ధైర్యవంతురాలైన వేరా నోరు విప్పలేదు. అప్పుడా రాక్షసులు ఆ తల్లి కళ్ళముందే రోజుల పసిబిడ్డని చంపేసారు. ఆ తరువాత ఆమెని కూడా ప్రాణాలతో ఉంచలేదు. వసీలీ యుద్ధంలో గాయపడి తిరిగివచ్చాడు. ఆయన ఛాతీలో లోహపుముక్కలు ఉండిపోయాయి. గుండెలో భార్యాబిడ్డల మరణం పట్ల ఆవేదన నిండిపోయింది.

వసీలీ 29 ఏళ్ళపాటు తన ఊరైన పావ్లిస్‌లో బడిని నడిపారు. యుద్ధం కారణంగా చాలామంది పిల్లలు అనాథలయ్యారు. బాధతో కుంగిపోయారు. వారి జీవితాల్లో మళ్ళీ ఆనందం నింపడానికి ఆయన ఎంతో కృషి చేశారు. ఆయన పిల్లల కుటుంబాల గురించి బాగా తెలుసుకునేవారు. ఆ బడికి ప్రిన్సిపాల్ అయి కూడా రోజంతా పిల్లలకి పాఠాలు చెప్పేవారు. పిల్లల సాంగత్యంలో ఆయనకి





నూతన ఉత్సాహం, శక్తి లభించేవి. పిల్లల చదువుకి, వారి వ్యక్తిత్వ వికాసానికి దగ్గర సంబంధం ఉందని ప్రపంచంలోని చాలా మంది విద్యావేత్తలు నమ్మే వారు. వసీలీ ఈ సిద్ధాంతాన్ని ఆచరణలో నిరూపించారు. పిల్లలని యోగ్యులు, అయోగ్యులు అని నిర్ణయించకుండా మంచి చదువుని అందించవచ్చు అని ఆయన నమ్మారు. సుఖోమ్లీన్స్కీ ఎన్నో పుస్తకాలు రాసారు. వాటన్నిటిలో ప్రముఖమైనది "బాలల హృదయాంతరాలు". ఈ పుస్తకంలో ఆయన పిల్లల అంతరంగాల గురించి తల్లిదండ్రులకి, ఉపాధ్యాయులకి వివరించారు.

"బడికి వచ్చేముందు కొన్ని సంవత్సరాలు, బడిలో మొదటి కొన్ని సంవత్సరాలలోనే మనిషి యొక్క భవిష్యత్తుకి పునాది పడుతుంది అని నా దృఢ విశ్వాసం" అని ఆయన తన పుస్తకంలో రాశారు.

పిల్లలు కొత్తగా బడికి వచ్చినప్పుడు వారిలో ఎన్నో ఆశలని, ఎంతో ఉత్సాహాన్ని తీసుకుని వస్తారు. మనమందరం కలిసి పిల్లల్లోని ఈ జిజ్ఞాసని కాపాడితే వారు పెద్దయ్యాక మంచి వ్యక్తులుగా తయారవుతారు. ✪

# సంచార విద్యావేత్త

జాన్ హోల్ట్ పేరుగాంచిన విద్యావేత్త. ఆయన ఎన్నో పుస్తకాలు రాశారు. ఆయన రాసిన పుస్తకం "పిల్లలు ఎలా విఫలమవుతారు" ప్రసిద్ధిగాంచింది. "బతకలేక బడిపంతులు" అవుతారనేది మనందరికీ తెలిసిన సూక్తి. తమకి నచ్చిన పనిచేస్తూ జీవనాన్ని కొనసాగించగలిగే అదృష్టవంతులు ఈ లోకంలో కొద్దిమందే. వీరిలో జాన్ హోల్ట్ ఒకరు. ఆయన మూడు సంవత్సరాలపాటు అమెరికా నౌకాదళంలోని ఒక జలాంతర్గామిలో పనిచేశారు. ఆ తరువాత నాలుగు సంవత్సరాలు ఒక బడిలో పనిచేశారు. ఆ బడిలో పని చేస్తుండగా రోజు జరిగే సంఘటనలని తన డైరీలో రాసుకునేవారు. ఆయన మొదటి పుస్తకం "పిల్లలు ఎలా విఫలమవుతారు" (హౌ చిల్డ్రన్ ఫెయిల్) ఈ డైరీ ఆధారంగా రాసినదే. 1964లో ప్రచురించిన ఈ పుస్తకం విద్యారంగంలో అలజడిని రేపింది. ఈ పుస్త





కాన్ని నిర్భయంగా, చక్కగా రాశారు. హోల్ట్ రచనాశైలి అద్భుతమైనది. జాన్ హోల్ట్ ఒక సీదా-సాదా మనిషి. ఆయనకి అమెరికా సమాజంలోని వినియోగదారీ వ్యవస్థ అంటే పరమ చిరాకు. పర్యావరణ సంరక్షణ అంటే చాలా ఆసక్తి. మితవ్యయాన్ని ఆయన పాటించేవారు. తను స్నానం చేసిన నీటిని ఎరువుకోసం తయారు చేసిన ఒక గుంతలో పోసేవారు. ఆ ఎరువుని ఆయన తోటల్లోని మొక్కలకి వేసేవారు. ఆయనకి తనుండే న్యూయార్క్ నగరం అంటే చాలా ఇష్టం. తను బయటికి వెళ్ళినప్పుడల్లా ఒక ఖాళీ సంచిని తీసుకెళ్ళేవారు. రోడ్డు మీద పడి ఉన్న ప్లాస్టిక్ గాజు సీసాలని ఏరి అందులో వేసేవారు. కనిపించిన చెత్తకుండీలో పారేసేవారు. ఆయన 1985లో క్యాన్సరు వ్యాధితో మరణించారు.

✪

# మీరాంబికా

"విద్య ఒకరు నేర్పేది కాదు. గురువు కేవలం దారి చూపటానికి మాత్రమే" అని అరవింద మహర్షి అన్నారు. ఆయన ఆదర్శాల ప్రకారమే ఢిల్లీలోని మీరాంబికా అనే బడి నడుస్తోంది. అరవిందో శిష్యులైన ఇద్దరు డచ్ దేశీయులు ఈ బడిని 15 సంవత్సరాల క్రితం స్థాపించారు. ఈ బడి మిగతా బడులకంటె వేరుగా ఉంటుంది. ఈ బడి 5వ తరగతి వరకే ఉంది. ఒక్కొక్క తరగతిలో 12 నుండి 15 మంది పిల్లలు మాత్రమే ఉంటారు. వీరికోసం ఇద్దరు, ముగ్గురు టీచర్లు ఉంటారు. ఎక్కువమంది టీచర్లు ఆశ్రమంలోనే ఉంటారు. పిల్లల తల్లిదండ్రులు కూడా బడిలో ఎంతో సహాయం చేస్తారు. ఈ బడి ఏ బోర్డుకిగానీ, ఎన్‌సిఇఆర్‌టికిగాని అనుబంధంగా లేదు. ఈ బడిలో పాఠాలు వల్లించడానికంటే అనుభవాల నుంచి నేర్చుకోవటానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ప్రశ్నలు అడగటాన్ని ప్రోత్సహిస్తారు. ఈ బడిలో మూసపోత విద్య ఉండదు. పిల్లలు తమకిష్టమైన ప్రాజెక్ట్ లేదా విషయాన్ని ఎన్నుకుని, పని చేస్తారు.

ఉదాహరణకి 'పక్షులు' అనే ప్రాజెక్ట్‌లో పనిచేసే పిల్లలు ముందుగా గ్రంథాలయానికి వెళ్ళి పక్షుల మీద పుస్తకాలు చూస్తారు. ఆశ్రమానికి చెందిన 26 ఎకరాల స్థలంలో పక్షులని గమనిస్తారు. దాంతోపాటు పిల్లలు ఢిల్లీకి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న సుల్తాన్‌పూర్ అభయారణ్యానికి కూడా వెళ్ళి చూస్తారు. ఈ పక్షుల





ప్రాజెక్టులో భాష, లెక్కలు, విజ్ఞాన, భూగోళ శాస్త్రాలు, కళలు అన్నీ ఇమిడి ఉంటాయి. పిల్లలు పక్షుల మీద కవితలు, వ్యాసాలు రాస్తారు. ఎన్నో పక్షులు ఎంతో దూరాల నుండి భారతదేశానికి వలస వస్తాయి. ఈ పక్షులు వచ్చే దారిని పిల్లలు గ్లోబుమీద గుర్తిస్తారు. వివిధ పటాలలో పక్షుల వనాలని గుర్తు పెడతారు. కాగితాలని మడిచి ఎన్నోరకాల పక్షుల బొమ్మలని తయారుచేస్తారు. ఈవిధంగా పక్షుల గురించి ఎన్నో ఆసక్తికరమైన విషయాలు నేర్చుకుంటారు. ఇలా నేర్చుకోవడంలో ఉన్న ఆనందమే వేరు. ✪

# కళ్ళుండీ చూడలేనివారు

అప్పుడప్పుడు నేను నా స్నేహితులు ఏం చూస్తున్నారో తెలుసుకోవాలనుకుంటాను. వారిని ప్రశ్నిస్తుంటాను. ఒకసారి ఒక స్నేహితురాలు అడవిలో షికారుకెళ్ళి వచ్చింది. "అడవిలో నువ్వేం చూశావని" నేనామెని అడిగితే అంత విశేషాలేమీలేవని జవాబిచ్చింది. ఈ జవాబు నన్ను ఆశ్చర్యపరచలేదు. నేనిలాంటి జవాబు ఎంతోమంది దగ్గర విన్నాను. కళ్ళుండి చూడగలిగినవారు చాలా తక్కువ చూస్తారని నా నమ్మకం.

కాకపోతే గంటల తరబడి అడవిలో తిరిగితే విశేషాలేమీ కనిపించవా? కంటికేమీ కనిపించని నాకే స్పర్శద్వారా ఎన్నో విశేషాలు తెలుస్తాయి. కొండ రావిచెట్టు నునుపైన కాండాన్ని, జాజికాయ చెట్టు గరుకుదనాన్ని స్పర్శతో గుర్తించగలను. వసంత కాలంలో చిగురుటాకుల మధ్య మొగ్గలకోసం తడుముతుంటాను. పూరెక్కలలోని పట్టులాంటి మెత్తదనం, ఆ పూరెక్కల అమరిక నాకు అపారమైన ఆనందాన్నిస్తాయి. వీటితో నేను అద్భుతమైన ప్రకృతి అనుభూతిని పొందుతాను. కొన్నిసార్లు చిగురుటాకులని తాకగానే నా మదిలో పక్షుల కిలకిలారావాలు మెదులుతాయి. నా వేళ్ళ సందుల నుండి పారే చల్లటి సెలయేటి నీరు వింతైన అనుభూతిని కలుగజేస్తుంది. నేలపై పరుచుకున్న ఆకులు, గడ్డి మైదానాలు నాకు పట్టు తివాచీల కంటే ప్రియమైనవి. మారే రుతువులు నా జీవితంలో కొత్తదనాన్ని నింపి ఎంతో ఆనందాన్ని కలుగజేస్తాయి.





ఈ మనోహర దృశ్యాలని చూసి ఆనందించడానికి కొన్నిసార్లు నా హృదయం పరితపిస్తుంది. వీటి స్పర్శతోనే నా కింత ఆనందం కలుగుతుంటే, వాటిని చూసి నా హృదయం ఎంత ఆనంద భరితమవుతుందో! కానీ నిజానికి చూపున్న వారు చూసేది చాలా తక్కువ. ప్రకృతిలోని అద్భుతమైన రంగులు వారి మనస్సుని తాకలేవు. మనుషులు వారి భావాలని గుర్తించలేరు. వారి దగ్గరలేని వస్తువుల కోసం అర్రులు చాస్తూ ఉంటారు. కన్నులతో ఇవన్నీ చూడగలిగే అదృష్టాన్ని ఎంతో సాధారణమైన విషయంగా భావించడం ఎంత దురదృష్టకరం. నిజానికి కంటి చూపుతో జీవితంలో రంగుల హరివిల్లు నింపుకోవచ్చు. ✪

(హెలెన్ కెల్లర్ – అమెరికాకి చెందిన రచయిత్రి.
పుట్టుకతోనే కళ్ళుకనపడవు, చెవులు వినపడవు)

# వంట - శిక్షణ

సేవాగ్రాంలోని 'నయీ తాలీమ్' బడిలో పనులద్వారా చదువు చెప్పేవారు. మా బడిలో రోజూ దాదాపు వందమంది భోజనం చేసేవారు. ఇంతమందికి వంటచేసే బాధ్యత వంతులవారీగా పిల్లలకి ఇచ్చేవారు. ఎనిమిది మంది ఒక జట్టుగా కూడి ఈ పని చేసేవాళ్ళు. ఒక నెలలో వంటకి ఎంత ఖర్చు చేయవచ్చో ముందే చెప్పేవారు. పరిమిత ఖర్చుతో రుచిగా ఉండి, పోషక విలువలు కలిగిన ఆహారం అందించటం మాకు శక్తికి మించిన పనిగా ఉండేది. ఆలుగడ్డల ధర తక్కువగా ఉండేవి. కానీ పోషక విలువల దృష్ట్యా ఎక్కువగా పిండి పదార్థాలే ఉండటంవల్ల వాటిని వదిలేయవలసి వచ్చింది. ఐసిఎమ్ఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్) వాళ్ళు చెప్పిన కనీస మాత్రం నూనె వాడితే పూర్తి నెలకి కేటాయించిన డబ్బు నూనెకే సరిపోయేది. తెలివైన గృహిణికున్న నేర్పు కూడా మాకు లేదు. ఈ అర్థశాస్త్రం, ఆహార శాస్త్రాలతో కుస్తీపడుతూ, ఏదో విధంగా పని జరిపించటానికి ప్రయత్నించే వాళ్ళం. చాలాసార్లు మేం అనుకున్నవి కాగితాల మీదనే సాధ్యపడేవి. నిజంగా అలా చేయలేకపోయేవాళ్ళం. పప్పు ఉడకటానికి ఎంతసేపు పడుతుందో కూడా చాలాసార్లు మాకు తెలిసేది కాదు. చివరికి రాత్రికి మేం గిన్నెలని తోముతూ, కడుగుతూ ఉంటే యుద్ధంలో గాయపడిన సైనికుల వలె అనిపించేది. అయినాకానీ మరుసటి రోజు చేయవలసిన వంటపనులు మా కళ్ళ ముందర మెదులుతూనే ఉండేవి.





కానీ ఈ మొత్తం పనిలో మేము మూడు విషయాలు బాగా నేర్చుకున్నాం. అవి పోషక విలువల గురించి తెలిపే ఆహార శాస్త్రం, ఇంటికి సంబంధించిన ఆర్థికశాస్త్రం, ఇంకా పాకశాస్త్రం. కొత్తిమీరలో 10,600 యూనిట్ల 'ఎ' విటమిన్ ఉంటుందనే విషయం నాకు ఇప్పటికీ గుర్తుంది. నేను వంటింట్లో పనిచేస్తూ కొద్ది రోజుల్లో నేర్చుకున్న విషయాలు పది సంవత్సరాలపాటు చదివిన మెడికల్ కాలేజీలో కూడా నేర్చుకోలేదు. రోజువారీ జీవితంలోని విషయాల నుంచికూడా మనం చాలా నేర్చుకోగలం.

✪

# సృజన బడి

చదువుని ఆసక్తికరంగాను, పిల్లలు ఇష్టపడేటట్లు చేయాలని మేం కొత్తగా ఒక బడిని మొదలుపెట్టాం. పిల్లలకి చదువు నీరసంగాను, భారంగాను అనిపించకూడదు. చదువు వారి జీవితాలకి దగ్గరగా, భవిష్యత్తులో ఉపయోగపడేటట్లు ఉండాలనేది మా ఉద్దేశం. బడి మొదలైనపుడు పదిహేనుమంది పిల్లలు మాత్రమే ఉన్నారు. అందరూ దాదాపు తొమ్మిది సంవత్సరాల పిల్లలే. మా బడి నెల్లూరు జిల్లాలో ఉంది.

మా దృష్టిలో "నేర్చుకోవటం" అంటే ఆలోచించడం, అర్థం చేసుకోవడం. పరీక్షలు ఈ "నేర్చుకోవటం" అనే ప్రక్రియకు ఏవిధంగాను సహాయపడవని మా గట్టి నమ్మకం. అందుకే మాబడిలో పదవతరగతి వరకు మేం ఎలాంటి పరీక్షలు పెట్టలేదు. చాలా బడులలో పిల్లలు పరీక్షలు కోసం బట్టీ పడతారు. "మంట మండటానికి ఆక్సిజన్ అవసరం" లాంటివి పూర్తిగా అర్థం చేసుకోకపోవడం వల్ల ఈ విషయాలని త్వరలోనే మర్చిపోతారు. ఇదే విషయాన్ని చెప్పటానికి ఒక వెలుగుతున్న కొవ్వొత్తి మీద ఒక గాజు సీసాని బోర్లిస్తే ఆ కొవ్వొత్తి కొంతసేపు వెలిగి ఆరిపోతుంది. ఈ చిన్న ప్రయోగం ద్వారా నేర్చుకొన్న అదే విషయాన్ని పిల్లలు ఎప్పటికీ మర్చిపోరు.

పిల్లల జీవితాలకీ, వారి సమాజానికి అనుగుణంగా చదువు ఉండాలనేది మా కోరిక. ఆ విధంగానే మా బడిలోని పాఠ్యాంశాలని తయారుచేశాం. ఉదాహరణకి పిల్లలు విజ్ఞానశాస్త్రంలో మా ఊళ్ళోని ఇళ్ళ గురించి తెలుసుకుంటారు. ఆ ఇళ్ళు నిర్మించటానికి ఏమేమీ ఉపయోగించారు, వాటి నిర్మాణం ఎలా ఉంది, ఇళ్ళ





కప్పులు ఏటవాలుగా ఎందుకున్నాయి, వాటి గోడలు పొట్టిగా ఎందుకున్నాయి? ఇంటి వాళ్ళు పశువులని ఎక్కడ కట్టేస్తారు, వాళ్ళు ఎక్కడ పని చేస్తారు? లాంటి ఎన్నో ప్రశ్నలకి జవాబులు తెలుసుకుంటారు. గుడి, బడి, తపాలా కార్యాలయం (పోస్టాఫీసు), పంచాయితీ ఆఫీస్ వంటి వాటి గురించి కూడా మేం వివరంగా చర్చిస్తాం.

మా బడిలో పిల్లలందరికి తెలుగు మాతృభాష. అందుకని మేం మొదటి సంవత్సరం పిల్లలకి ఇంగ్లీషులో మాట్లాడటం మాత్రమే నేర్పిస్తాం. ఇంగ్లీషు చదవటం, రాయడం ఉండదు. పిల్లలు తాము ఇష్టపడే ఆటల ద్వారా ఇంగ్లీషు భాషని చాలా సహజంగా నేర్చుకుంటారు. పిల్లలకి ఎన్నో పాటలు, నృత్యాలు కూడా నేర్పిస్తాం. వీటిద్వారా పిల్లలు అర్థాలే కాకుండా భావభంగిమలు కూడా నేర్చుకుంటారు. భాషలోని లయ కూడా నేర్చుకుంటారు. చిన్న చిన్న నాటికలు, అనుకరణ కూడా ఇంగ్లీషు నేర్చుకోవడానికి ఉపయోగపడతాయి. పిల్లలు ఆలోచించడానికి, ఆలోచనలని వ్యక్తపరచడానికి మాతృభాషే అనువైనది. కాని దౌర్భాగ్యం ఏంటంటే మనలో చాలా మంది తెలుగుకంటే ఇంగ్లీషు ఉత్తమమైనదని అనుకుంటారు. వారి అభిప్రాయం ఏంటంటే –

1. పిల్లలకోసం తెలుగుకంటే ఇంగ్లీషులో ఎక్కువ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.




2. ముందు నుంచే ఇంగ్లీషు నేర్చుకుంటే మున్ముందు పిల్లలు ఎంతో మంచి ఇంగ్లీషు పుస్తకాలు చదవగలుగుతారు.

మా బడిలో పిల్లలు కూడికలు, తీసివేతలు కూడా అనుభవం ద్వారానే నేర్చుకుంటారు. పిల్లలకి నిజమైన డబ్బు ఇచ్చి దాని వాడకం నేర్పుతాం. తరగతి గదిలోనే ఒక దుకాణం తెరిచి అందులో గ్లాసు, చెంబు, బంతి, బట్టలు వగైరా పెడతాం. పిల్లలు తమ వద్ద ఉన్న డబ్బుతో ఈ వస్తువులని కొనుక్కోవచ్చు. పిల్లల్లోనే ఒకరు ఈ దుకాణాన్ని నడుపుతారు. వారు పిల్లలని మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. పిల్లలు ఆ మోసాన్ని గుర్తించి తెలివిగా ప్రవర్తిస్తారు. ఒకవేళ ఎవరైనా మోసపోతే అందుకు వారెంతో సిగ్గుపడతారు. ఆ తరువాత నుండి జాగ్రత్తగా ఉంటారు. ఈవిధంగా కూడికలు, తీసివేతలు పిల్లలు ఎంతో సులువుగా నేర్చుకోవడమేగాక, ఎప్పటికీ మరిచి పోరు. పిల్లలు తమ చేతులతో పనిచేయడాన్ని మేం ప్రోత్సహిస్తాం. దీనికి ముఖ్యంగా రెండు కారణాలున్నాయి:

1. పిల్లలు తాము చేసేపనిని చక్కగా, అందంగా పూర్తి చేయాలన్న కోరికతో ప్రయత్నిస్తారు.
2. ఈ పనుల ద్వారా వాటికి సంబంధించిన విషయాలుకూడా పిల్లలు ఇష్టపడేటట్లు చేయగలుగుతాం.

ఉదాహరణకి అట్టముక్కలతో చేసిన త్రిభుజం, వృత్తం, చతురస్రం వంటి ఆకారాలతో గణితాన్ని ఎంతో ఆసక్తికరంగా చేయవచ్చు. పిల్లలు రకరకాల వస్తువులతో పనిచేస్తారు. రంగులు వేయడం, మట్టితో వస్తువులు చేయడం, చిత్రకళ, అద్దకం, పేపర్ కటింగ్ లాంటివి పిల్లలకి ఎంతో ఇష్టం. మేం వడ్రంగి పనికూడా పిల్లకి నేర్పించాలనుకున్నాం. కాని దానికి కావలసిన పరికరాలు చాలా ఖరీదైనవి కాబట్టి పిల్లలకి దానిని నేర్పించలేకపోయాం.

వ్యవసాయం గురించి మా బడి పిల్లలదంరికీ ఎంతో కొంత తెలుసు. ఏదైనా కొత్త పంట వేసినప్పుడు మేమందరం దాని గురించి చర్చిస్తాం – ఆ పంటకి ఏ ఎరువు వేయాలి? ఎక్కువ రాబడి కోసం ఏం చేయాలి? మా బడిలో పిల్లలందరికి ఎంతోకొంత భూమి ఉంది. పిల్లలు వారి పొలానికి సంబంధించిన పూర్తి వివరాలతో రికార్డులు తయారు చేస్తారు.

పిల్లలు క్రమం తప్పకుండా బడికి రావాలని మేం ఆశిస్తాం. కానీ పేద కుటుంబాలలోని పిల్లలు ఇలా రాలేకపోతారు. నాట్లు వేయడం, పంట నూర్చడం వంటి పనులున్నప్పుడు ఈ పిల్లలు ఇంట్లో ఉండిపోతారు. చిన్న పిల్లలను చూసుకోవడం, ఇంట్లోని మిగతా పనుల బాధ్యత వీరిమీద పడుతుంది. పొతాలు జరిగేటప్పుడు పిల్లలందరూ బడికి రావాలని మేం కోరుకుంటాం. అయితే నిజానికి ఇలా జరగదు. కొంతమంది పిల్లలు మధ్యలోనే బడి వదిలేస్తారు. వాస్తవికతకి మనం దూరంగా ఎలా ఉండగలం?

**– ఎలినార్ వాట్స్, శివరాం.**



# పిల్లల వైఫల్యాలకు కారణాలు

విద్యాలయాలలో ఎక్కువ శాతం పిల్లలు విఫలమౌతారు. వీరిలో చాలామంది పూర్తిగా విఫలమౌతారు. బడిలో చేరిన పిల్లల్లో సుమారు నలభైశాతం మంది వారి చదువుని ముగించలేరు. కాలేజీల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు మధ్యలోనే చదువు ఆపేస్తారు.

పై తరగతిలోకి నెట్టబడిన పిల్లలకి ఎంత తెలుసో చెప్పడం చాలా కష్టం. పిల్లలు పుట్టుకతోనే నేర్చుకోవడం, అర్థం చేసుకోవడం, నిర్మించడం వంటి విషయాలలో అపారమైన సామర్థ్యం కలిగి ఉంటారు. మొదటి రెండు, మూడు సంవత్సరాలలో పిల్లలు ఈ శక్తిని అద్భుతంగా ఉపయోగించుకుంటారు. బడిలో చాలా మంది పిల్లలు ఈ శక్తిలో చాలా చిన్న భాగాన్ని మాత్రమే ఉపయోగించుకుంటారు. పిల్లలు ఎందుకు విఫలమౌతారు?



బడిలో పిల్లలు భయపడతారు, విసుగు చెందుతారు, కలవరపడతారు కాబట్టే విఫలమౌతారు. తల్లితండ్రులని, టీచర్లని నిరాశ పరుస్తామన్న భయం చాలా ఎక్కువ. ఈ భయం వారిని ఎల్లప్పుడు వెన్నంటి ఉంటుంది.

బడిలో చెప్పే విషయాలు, చేసే పనులు ఎంతో నీరసంగా ఉంటాయి. పిల్లల తెలివితేటలని, శక్తిని ఇవి ఏమాత్రం ఉత్తేజపరచవు. అందుకే పిల్లలు బడిలో ఎంతో విసుగుచెందుతారు. బడిలో చెప్పే చాలా విషయాలు ఉప్పెనలా పిల్లలని ముంచెత్తుతాయి. ఈ విషయాలు పిల్లల నమ్మకాలకి ఎంతో విరుద్ధంగా, పిల్లల మనసులోని ఊహలకి ఎంతో దూరంగా ఉంటాయి. దీనితోటి పిల్లలు ఎంతో కలవరపడతారు.

మంచి బడులు రెండు విశేషాలను కలిగి ఉంటాయి:

1. పిల్లలు బడిలో ఏమీ నేర్చుకోలేకపోతే అందుకు బడి పూర్తి బాధ్యత వహిస్తుంది. పిల్లల మీద, వారి తల్లిదండ్రుల మీద లేనిపోని కారణాలను నెట్టదు.
2. తరగతులలో ఉపయోగించే పద్ధతులని క్రమం తప్పకుండా సమీక్షించుకుంటారు. ఏదైనా పద్ధతి పిల్లలకి తగినట్లుగా లేకపోతే, దానిని వదిలేసి కొత్త పద్ధతులని ప్రయత్నిస్తారు. ఇలాంటి మంచి బడుల్లో ఒకవేళ విఫలమంటూ జరిగితే అది పద్ధతులదేకాని పిల్లలది కాదు.

**–జాన్ హోల్ట్**



# పిల్లల సొంత పత్రిక

**స్థలం:** అమరవీరుడు భగత్‌సింగ్ గ్రంథాలయం, పిపరియా గ్రామం, మధ్య ప్రదేశ్.

ఆ రోజు ఆదివారం. గ్రంథాలయం పిల్లలతో కిక్కిరిసి ఉంది. గోడమీద ఒక పెద్ద బూడిదరంగు కాగితం అతికించి ఉంది. దాని మీద "పిల్లల పత్రిక" అని రాసి ఉంది. పిల్లలని వాళ్ళకిష్టమైన విషయమేదైనా రాసి, లేదా ఏదైనా చిత్రం గీసి ఆ కాగితం మీద అతికించమని చెప్పారు.

మొదట్లో పిల్లలు వాళ్ళ పుస్తకాలలోని విషయాలను రాశారు. కొన్ని బొమ్మలని చూసి గీశారు. చాలాసేపు చర్చించిన తరువాత పిల్లలకి వారు సొంతంగా రాయాలని, గీయాలనీ అర్థమైంది. "బావిలో పడ్డ మేక" – "కాలవలో పడ్డ కుక్క" ఇవి రెండూ మొదటి వార్తలు.

ఒకరోజు సాయంత్రం ఆ ఊరిలోని సినిమా హాలులో గొడవ జరిగింది. కొంతసేపటికి గ్రంథాలయానికి వచ్చిన పిల్లలు పత్రికలో ఆ గొడవ గురించి చదివి చాలా ఆశ్చర్యపోయారు. ఆ రోజునుండి



పిల్లలు ఆ పత్రికలో అన్నిరకాల వార్తలు రాయడం మొదలుపెట్టారు. వారి ఆటపాటలు, సెలవులు, వారి కలలు, సమస్యల గురించి రాయసాగారు.

తొందరలోనే ఈ పత్రిక 'చిన్నారి పక్షులు' అనే పేరుతో ముద్రించబడింది. 1989-90లో ఈ పత్రిక దాదాపు 1000 కాపీలు ముద్రించబడింది. దీనిని పిల్లలు 25 పైసలకి కొనుక్కునేవారు. పిల్లలు ఈ పత్రికద్వారా తమ బడుల్లోని లోటుపాట్లని ఎత్తిచూపడం మొదలుపెట్టారు. బడికిరాని మాష్టారు, తరగతిలో నిద్రపోయే మాష్టారు, డబ్బులివ్వకుండా పిల్లలతో కూరగాయలు తెప్పించుకునే హెడ్మాష్టరు వంటి వీరందరి గురించి పిల్లలు ఈ పత్రికలో రాశారు. ఈ వార్తల మూలంగా పిల్లలు అప్పుడప్పుడు దెబ్బలు తినాల్సి వచ్చేది. అయితే ఈ పత్రిక పట్ల ప్రజల ఆసక్తి పెరుగుతూనే ఉంది. చాలామంది పిల్లలు వారి మాతృభాష అయిన 'బుందేలీ'లో వార్తలు రాసేవారు. వారి తల్లితండ్రులకి ఈ వార్తలని చదివి వినిపించే వారు. మీ బడిలో ఒక పెద్ద బూడిదరంగు కాగితాన్ని అతికించి మీరు కూడా ఇటువంటి పత్రికని తేలికగా మొదలుపెట్టవచ్చు. రాయడానికి, బొమ్మలు గీయడానికి పిల్లలని ప్రోత్సహించవచ్చు. ఈవిధంగా పిల్లలు వారి అనుభవాల గురించి రాసినప్పుడు వారి రచనా శక్తి పెరుగుతుంది. పిల్లలు వారి చుట్టూ జరిగే విషయాలని క్షుణ్ణంగా పరిశీలించడం నేర్చుకుంటారు. పిల్లలలో దాగి ఉన్న ప్రతిభని బయటికి తీయడానికి ఇటువంటి పత్రికలు ఒక మంచి మార్గం. ✪

# ఇసుక రేణువు

తెలుగు, హిందీ, ఉర్దూ వంటి భాషలు నేర్చుకోవాలంటే ముందు వాటి అక్షరాలు నేర్చుకోవాలి. అలాగే ప్రకృతిలోని వర్ణ మాల నేర్చుకోవాలి. ప్రకృతిని చదవడం ప్రతి ఒక్కరికి ఎంతో కొంత వచ్చే ఉంటుంది.

మీకు కనిపించిన గుండ్రటి, నున్నటి రాయి మీకేం చెబుతుంది? అది అంత నున్నగా, గుండ్రంగా ఎలా తయారయ్యింది? దాని గరుకుదనం, అంచులు ఏమయ్యాయి? ఏదైనా ఒక రాయిని విరగ్గొడితే దాని ముక్కలు ఎగుడు దిగుడుగా, గరుకుగా ఉంటాయి. ఆ రాళ్ళు చూడడానికి అస్సలు గుండ్రంగా, నున్నగా ఉండవు. మరి అటువంటి రాయి ఇంత నున్నగా, గుండ్రంగా ఎలా అయింది?

ఒకవేళ మీరు కళ్ళు, చెవులు తెరుచుకొని చూడగలిగితే, వినగలిగితే ఈ రాయి తన ఆత్మకథని మీకు చెబుతుంది. కోట్ల సంవత్సరాల క్రితం అది కూడా ఇప్పుడు మీరు పగలగొట్టిన రాయిలాగానే గరుకుగా, కొనదేరిన అంచులతో ఉండేది. అది ఏదో ఒక కొండ మీద ఉండేది. జోరుగా కురిసిన వాన దానిని సెలయేరులోకి తోసింది. ఆ సెలయేరు దానిని ఒక ఉపనదిలోకి తీసుకువెళ్ళింది. ఆ ఉపనది దానిని పెద్ద నదిలో కలిపింది. అప్పటినుంచి ఆ రాయి నదిలోని నీళ్ళతోపాటే ప్రవహించింది. దాని అంచులు అరిగిపోయి ఆ రాయి గుండ్రంగా, నున్నగా తయారయింది.





అదే మీరిప్పుడు చూసే నున్నటి, మెరిసే రాయి. నదిలో అలా ప్రవహిస్తూ ఉంటే క్రమంగా ఆ రాయి చిన్నదిగా అయిపోతుంది. ఆఖరికి ఇసుక రేణువుగా మిగిలిపోతుంది. ఈ ఇసుకతోనే పిల్లలు ఆడుకుంటారు, కోటలు కడతారు. ప్రకృతి అందరికంటే గొప్ప టీచరు.

– జవహర్‌లాల్ నెహ్రూ

# విజ్ఞాన శాస్త్రం

మామూలుగా విజ్ఞాన శాస్త్రం అంటే పిల్లలు కొన్ని సూత్రాలు, మరికొన్ని సంకేతాలు బట్టీపట్టి పరీక్షల్లో రాయడం వరకే పరిమిత మవుతుంది. కానీ నిజానికి ఈ శాస్త్రానికి ప్రజల జీవితంతో దగ్గరి సంబంధం ఉండాలి.

ఆంధ్రప్రదేశ్‌లోని ఒక పాఠశాలకి చెందిన టీచరు ఒక వినూత్న ప్రయోగాన్ని చేశారు. పిల్లల సహాయంతో ఇనుపతీగని గుండ్రంగా చుట్టి దానికి దోమతెరని కట్టి ఒక సంచిలాగా తయారుచేశారు. దానికి ఒక వెదురు కట్టెను పిడిగా అమర్చారు. కీటకాలని పట్టుకోవ డానికి అనువుగా అది తయారయింది. పిల్లలందరికి తలొక 'నెట్' తయారు చేశారు.

పిల్లలందరికి తలా కొంత పొలాన్ని కేటాయించారు. ప్రతిరోజు ఉదయం బడికి వచ్చేముందు పిల్లలు తమకి కేటాయించిన స్థలంలో ఒకసారి ఆ జాలీలో చిక్కిన కీటకాలని బడికి తీసుకువచ్చేవారు.

బడిలో పిల్లలు ఈ కీటకాలని వర్గీకరించేవారు. వాటి పేర్లు, మిగతా వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేసేవారు. ఈ కీటకా





లలో ఏవి పైరుకి మిత్రులు, ఏవి పైరుకి శత్రువులు అనే విషయం మీద చర్చ జరిగేది. అనుభవంగల రైతులని కూడా అడిగి తెలుసు కునేవారు. పిల్లలు ప్రతిరోజు కీటకాలని లెక్కబెట్టి వాటి గ్రాఫు తయారుచేసేవారు. దీనివల్ల కీటకాల సంఖ్యలో పెరుగుదల గురించి స్పష్టమైన అవగాహన లభించేది. ఎక్కువ కీటకాలు ఎప్పుడు ఉన్నాయి? క్రిమి సంహారక మందులు చల్లడానికి ఎప్పుడు అనువైన సమయం? ఏ రసాయనిక మందులవల్ల పైరుకి మిత్రు లైన కీటకాలు కూడా నశిస్తున్నాయి? వేపాకు కషాయం, పొగాకు కషాయం వంటివి పనిచేస్తాయా?

పిల్లలు ఈ ప్రశ్నలన్నింటి గురించి చర్చించేవారు. కొత్త కొత్త ప్రయోగాలు చేసేవారు. అన్ని విషయాలు తెలుసుకునేవారు. ఈ విజ్ఞానం పిల్లలకి ఇష్టంగాను, ఉపయోగకరంగాను ఉండేది.

# పార్క్ స్కూల్

కొన్ని దశాబ్దాల క్రితం వరకు బడుల్లో పిల్లలని బాగా కొట్టే వారు. ఇప్పుడు దీనిలో కొంత మార్పు వచ్చింది. చదువు పిల్లలకి అనుగుణంగా మారింది. ఎన్నో ప్రగతిశీల విద్యాలయాలు తెరవబడ్డాయి. పిల్లల మెదడులో జ్ఞానాన్ని నింపడం కాకుండా వీటిలో పిల్లలు సంపూర్ణ వికాసం మీద అధ్యాపకలు దృష్టి పెడతారు.

పిల్లలకి మాట్లాడడం ఎవరూ నేర్పించరు. కానీ పిల్లలు తమంతట తామే మాట్లాడడం నేర్చుకుంటారు. బహుశా పిల్లలు మిగతా విషయాలలో నైపుణ్యం కూడా ఇలాగే పొందగలరేమో? ఇంగ్లాండులో 'పార్క్‌స్కూల్' అనే ఒక బడి ఉంది. ఇక్కడ పదకొండు సంవత్సరాల లోపు పిల్లలు చదువుకుంటారు. ఈ పిల్లలు ఆనందంగా ఉంటారు. వారి చురుకైన మెదడు ఎల్లప్పుడూ కొత్త విషయాల కోసం వెతుకుతూ ఉంటుంది. ఈ బడిలోని టీచర్లు ఎంతో నైపుణ్యం కలిగి ఉంటారు. పిల్లల్ని ఎంతగానో ప్రేమిస్తారు. వీరి లీడరు క్రిస్ నికోల్ ఇలా అంటారు: "పిల్లలందరు





ఆనందకరమైన బాల్యాన్ని పొందాలి. పరిశీలించి తెలుసుకోవడానికి ఇక్కడి పిల్లలకు పూర్తి స్వాతంత్రం ఉంది. స్వేచ్ఛగల పిల్లలు ఎల్లప్పుడు కొత్త విషయాల కోసం వెతుకుతుంటారు. వీరు ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ఉత్సాహం చూపిస్తారు. ఈ మారుతున్న ప్రపంచంలో వారి స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉంటారు." అనుభవంగల మార్గదర్శకునిగా టీచరు వ్యవహరించాలి. నేర్చుకోవాలన్న కోరికను పిల్లలు కోల్పోయేలా టీచర్లు అడ్డంకులు కల్పించకూడదు. మామూలు బడులలోని విధానాలతో ఎంతో మంది పిల్లలకు గణితంపట్ల, శారీరక వ్యాయామం పట్ల ద్వేషం కలిగింది. చదువుని పిల్లలకి అనుగుణంగా చేయడానికని మామూలు బడుల కంటే భిన్నంగా పార్క్ స్కూల్‌లో పనిచేస్తారు. ఈ బడి వాతావరణం చాలా సహజంగా ఉంటుంది. పిల్లలు ఎంతో సంతోషంగా ఉంటారు. పిల్లలు టీచర్లని వారి పేర్లతోనే పిలుస్తారు. బడి పిల్లలకి యూనిఫారం ఉండదు. ఇక్కడ అన్ని వయస్సుల పిల్లలు కలసి ఆడు కోవడం కనబడుతుంది. ఆట వస్తువులు చాలా ఉన్నాయి. అక్కడున్న కూరగాయల తోటని పూర్తిగా పిల్లలే చూసుకుంటారు. ✪

